ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కలీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 03 నవంబరు, 2026 | పేజీలు : 08

అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టు నియామకంపై విచారణ



మెయిన్‌లో

ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు
ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ఉద్యోగులంతా విధి నిర్వహణతో పాటుగా తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లో, ఉద్యోగుల కోసం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్లోని అధికారులు, ఉద్యోగులంతా వైద్య శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. మనకు తెలియకుండానే మనలోపల ఎన్నో అనారోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది, ముందుగానే పరీక్షలు చేసుకొని అనారోగ్య సమస్యలు తెలుసుకోవడం ద్వారా ఎంతో మేలు ఉంటుందన్నారు. తగిన మందులు, జాగ్రత్తలు, జీవనశైలిలో మార్పుల ద్వారా మంచి ఆరోగ్యకర జీవితాన్ని పొందవచ్చునని చెప్పారు. ఎవరూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని వివరించారు. ప్రతిరోజు శారీరక వ్యాయామాలు, యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ ఉద్యోగులంతా రక్త పరీక్షలు పూర్తి చేసుకునే వరకు వైద్య శిబిరం కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజేందర్, సౌమ్య, సిబ్బంది, ఉన్నారు.



భీమేశ్వరస్వామి ఆలయానికి
పోటెత్తిన భక్తులు



క్షేత్రస్థాయిలో ఇఒ తనిఖీలు

ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకోవడంతో పాటు అభిషేకం, అన్న పూజ, కుంకుమ పూజ, స్వామివారల కల్యాణం, చండీ హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి గండ దీపంలో నూనె పోసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ ఈవో రమాదేవి స్వయంగా ప్రాంగణంలో పర్యవేక్షించారు. ఉచిత దర్శనం లైన్లు, శ్రీ ప్రదక్షిణ మార్గం, కోడెలు కట్టే ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దర్శనానికి వచ్చిన వృద్ధులు, చిన్న పిల్లలతో నేరుగా మాట్లాడి వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆలయ భద్రతపై ఎస్పీఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్ పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ బి. శ్రీరాములతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జోగుల.లచ్చయ్య సర్వే నెంబర్ 429లో గల 7 గుంటల భూమికి పట్టాదారు హక్కులు ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా ధర్మారం తాసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.శ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామానికి చెందిన జాసోదపు. లక్ష్మి తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయవలసిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన గాజుల. ప్రశాంత్ తాను శారీరక వికలాంగత్వం కల్గిన ఉండి డిగ్రీ పూర్తి చేశానని తనకు ఏదైనా ప్రభుత్వ ఆఫీసులో ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం మండలం గోదావరిఖని 18 ఇంక్లైన్ కాలనీకి చెందిన గంట. నరసమ్మ గృహ జ్యోతి పథకం తన కుటుంబానికి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం ఎంపీడీవోకు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో ఐవి వై విద్యార్థుల పతకాల పంట

ప్రజాపక్షం /కరీంనగర్ టౌన్: జాతీయ స్థాయిలో ఐ వీ వై (సీబీఎస్ఈ) హైస్కూల్ విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో నిర్వహించిన ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ , నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీల్లో ఆరు పతకాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఈ పోటీల్లో విద్యార్థులు మూడు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు.అండర్–17 విభాగంలో వి. సాయి తేజ స్పీడ్ స్ప్రింట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం, సింగిల్ డబుల్ అండర్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడు. టీమ్ ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో పి. క్రుతిక్ కుమార్, ఎస్. శ్రేయాన్స్ స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటారు.అదే విధంగా అండర్–10 విభాగంలో జి. త్రిషుల్ రెడ్డి సింగిల్ డబుల్ అండర్ ఈవెంట్‌లో రజత పతకం సాధించగా, అండర్–12 విభాగంలో శ్రేయాన్ పటేల్ స్పీడ్ స్ప్రింట్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.విద్యార్థుల విజయంపై పాఠశాల చైర్మన్ పసుల మహేష్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని, విద్యార్థుల కృషి, పట్టుదల, నిరంతర సాధనకు ఈ విజయాలు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ



విజయానికి విద్యార్థుల క్రమశిక్షణతో పాటు పీఈటీ ఉపాధ్యాయుల కృషి కూడా ఎంతో దోహదపడిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కెడిసిఎస్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి



ప్రజాపక్షం/ముత్తారం : కెడిసిఎస్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకుమేనేజర్ విష్ణు భక్తుల ప్రసాద్ తెలిపారు. రైతుల సంక్షేమంతోపాటు అత్యధిక వడ్డీ అందిస్తూ ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని పోతారం గ్రామంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ ఊట్ల చరణ్ తో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా రైతులకు పలు పథకాలు అందిస్తున్నాయని ప్రసాద్ తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమ యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమ యోజన ప్రయోజనాలను బ్యాంకు ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు ఖాతా వివరాలు,ఏటీఎం పిన్ నంబర్లు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. పంట రుణాలను సకాలంలో రెన్యూ వల్ చేసుకోవాలని,దీర్ఘకాలిక రుణాలను వెంటనే చెల్లించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాయమాటలతో కాలయాపన..

ప్రజాపక్షం/ముత్తారం : స్వామీజీలను మంథనికి తీసుకువచ్చి, ఇక్కడి గుడులన్నీ తిరుగుతూ హోమాలు చేస్తే నీ శాపాలు పోతాయేమో కానీ, నీకు ఓట్లు మాత్రం రావు.ఇక్క నిన్ను మంథని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు అని ముత్తారం మండల బిఆర్ఎస్ నాయకులు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఉద్దేశించి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సోమవారం ముత్తారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోతిపెద్ది కిషన్ రెడ్డి, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తన్న,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, ముత్తారం నూతన సర్పంచ్,మాజీ వైస్ ఎంపీపీ సుధటి రవీందర్ రావు,తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మంథని నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్‌ను తొలగించి, వెంటనే నూతన మార్కెట్ భవనాన్ని కట్టిస్తానని మాయమాటలు చెప్పి,ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పెట్టని దుర్మార్గానికి ఒడిగట్టారని మండిపడ్డారు. ఆ మార్కెట్ వ్యవస్థపైనే ఆధారపడి జీవనం సాగించే ఎంతోమంది పేద వ్యాపారులను రోడ్డున పడేసిన ఘనత మంత్రి శ్రీధర్ బాబుదేనని ఆరోపించారు.ఒకవైపు పేద ప్రజలు శాపనార్థాలు పెడుతుంటే,మరోవైపు మంత్రి మాత్రం హోమాలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్ని డబ్బు మూటలు తెచ్చి ఇచ్చినా,ఓట్లు వేయడానికి ప్రజలు సిద్ధంగా లేరని ముత్తారం మండల బిఆర్ఎస్ నాయకులు సూటిగా సవాల్ విసిరారు.

తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ హెల్త్ వింగ్ జనరల్

ప్రజాపక్షం/కొత్తపల్లి : తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ హెల్త్ వింగ్ జనరల్ సెక్రటరీగా చిట్టంపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి కవితక్కను నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతను అప్పగించినందుకు కవితక్కకు నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ఆశయాలు, సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కరీంనగర్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని నాగరాజు తెలిపారు. ముఖ్యంగా హెల్త్ వింగ్ ద్వారా ప్రజలకు ఆరోగ్య సంబంధిత సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. పదవిని కేవలం హోదాగా కాకుండా ప్రజలకు, పార్టీకి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కరీంనగర్ జిల్లాలో తెలంగాణ రక్షణ సేన హెల్త్ వింగ్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని చిట్టంపల్లి నాగరాజు పేర్కొన్నారు.



తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాపక్షం/తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు సిపిఐ తిమ్మాపూర్ మండల సమితి పక్షాన పొనగంటి కేదారి, బోయిని తిరుపతి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని వినతి పత్రం సమర్పించారు. అనంతరం కేదారి తిరుపతి మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావంతో రానున్న రోజుల్లో తీవ్ర సంక్షోభాన్ని రైతాంగం ఎదుర్కోవలసి వస్తది నీళ్లు లేక యాసాంగి పంటలు వేయొద్దని ప్రభుత్వం ప్రకటించిందని, రైతు పరిస్థితి కూడా అర్థం చేసుకొని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరారు.తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను కరువు పెన్షన్ అందించి ఆదుకోవాలన్నారు. బ్యాంకు రుణాలు అదనంగా పెంచాలని,



ఎల్ ని నో కాలాన్ని ఆసరాగా చేసుకొని బియ్యం మాఫియా, కృత్రిమ కొరత సృష్టించి బియ్యం రేట్లు అమాంతం పెంచి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని, వీటిపైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని బియ్యం మాఫియాను అరికట్టి పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొన్నగంటి కేదారి, తిరుపతి, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆవునూరి రమేష్, సిపిఐ నాయకులు గంగిపల్లి శంకర్, పార్నంది రాజ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి

ప్రజాపక్షం/కరీంనగర్ రూరల్: శాతవాహన యూనివర్సిటీలో ఎల్ఎల్బీ విద్యార్థిని చంద్రకళ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్యూ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఘటనకు దారితీసిన పరిస్థితులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రకళ మృతికి నిరసనగా సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ ఎదుట విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు బత్తుల రాజు మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతను పర్యవేక్షించాల్సిన యూనివర్సిటీ అధికారులు, వార్డెన్లు, కేర్‌టేకర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించారా అనే అంశంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతి ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఉమేష్ కుమార్ స్పందించాలని నాయకులు



కోరారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్లు, కేర్‌టేకర్లపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కుటుంబానికి అండగా ఉంటామని విసి హామీ

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన వీసీ ఆచార్య ఉమేష్ కుమార్ రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబానికి సంబంధించిన ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి, రిషి, పీడీఎస్యూ నాయకులు యోగేందర్, శివ, నరేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రజాపక్షం/గన్నేరువరం: గన్నేరువరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి ఆర్ట్స్ అండ్ కల్చరల్ పోటీల్లో సృజనాత్మక ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన 'పీఎం శ్రీ' పాఠశాలల పోటీల్లో భాగంగా.. విద్యార్థినులు అక్షిత, కావ్య క్రాఫ్ట్ విభాగంలో కార్డ్‌బోర్డ్‌తో అయోధ్య శ్రీరామ మందిరం నమూనాను అద్భుతంగా రూపొందించి ప్రదర్శించారు. ఈ కళాకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రశంసలు అందుకుంది. చిన్న వయసులోనే అద్భుత నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులను మండల విద్యాధికారి రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు (పబ్బ జ్యోతిలక్ష్మి , తిప్పారపు సౌజన్య తదితరులు) అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రైతులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/గన్నేరువరం: తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి అల్లాడుతున్న గన్నేరువరం మండల రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా, గన్నేరువరంను కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమన్నారు. పక్కనే ఉన్న ఇల్లంతకుంటతో పాటు పరిసర మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం, గన్నేరువరం మండలాన్ని ఎందుకు విస్మరించిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్, మాజీ వైస్ ఎంపీపీ న్యాత సుధాకర్, మహిళా మండల అధ్యక్షురాలు కుసుబుం సవీన, అటికేం శ్రీనివాస్ గౌడ్, కొట్టే భూమయ్య, పుల్లెల మల్లయ్య, బూర శ్రీనివాస్,సమ్మెట అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



ప్రజాపక్షం/గంగాధర: వరి కోతలు ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ దూలం కల్యాణ్ ఆరోపించారు. వరి ధాన్యం కొనుగోలు సెంటర్ లో వడ్లు పోసి 20 రోజులు గడుస్తున్నా నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం సిగ్గుచేటని అన్నారు. సోమవారం వర్షం పడడంతో ఆయన గ్రామంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తమ ధాన్యాన్ని మధ్య దళారులకు అన్ని నష్టపోతున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం వివక్ష దర్పణం సరికాదన్నారు. మండలంలో రైతులు కోసిన వడ్లను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు సెంటర్లు తెరవలేదన్నారు. వారం రోజుల క్రితమే రైతులు తమ వడ్లను సెంటర్ ల వద్దకు తరలించి కుప్పలు పోసి కాపలా కాస్తున్నారన్నారు. రాత్రి పగలు అక్కడే ఉంటూ వర్షం వస్తే తడవకుండా టార్పాలిన్లు కప్పుతూ నష్టం జరగకుండా చూసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉపసర్పంచ్‌కు కత్తిపోటు



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండలంలోని బండలింగంపల్లి గ్రామ ఉపసర్పంచ్‌కు కత్తిపోటు ఘటనపై ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు మందాటి రాము తీవ్రంగా ఖండించారు.ఆదివారం రాత్రి ఈ దాడికి పాల్పడిన మేదక్ జిల్లామీర్జాపూర్‌కు చెందిన అజ్మీర శ్రీనివాస్ అన పేయింటర్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఓ వివాదాన్ని సద్దుమణిచే ప్రయత్నంలో ఉపసర్పంచ్ బొడ్డురాజు మధ్యలోకి రావడంతో ఆయనపై దాడికి దిగినట్లు ఉపసర్పంచ్ తెలిపారు. సమాచారం.పోలీసులు పూర్తివివరాలు వెల్లడించాల్సి ఉంది,కాగ ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాముయాదవ్ నిందితుడిని శిక్షించాలని కోరారు.ఆసుపత్రిలో ఐదు కుట్లు వేశారని అన్నారు.ఒకప్రజాప్రతినిధి అని చూడకుండా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.ఆసుపత్రికి వెళ్ళి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య,జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణరెడ్డి వెళ్ళి పరామర్శించారు.

శేషప్ప కవి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/ధర్మపురి : రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ధర్మపురి పట్టణాన్ని సమగ్రంగా సుందరీకరించాలని, చారిత్రక ప్రాధాన్యత కలిగిన చింతామణి చెరువు కట్టపై ప్రముఖ భక్త కవి కాకుత్థం శేషప్ప కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని న్యాయవాది కూర్మాచలం ఉమామహేష్ ప్రభుత్వాన్ని కోరారు.ధర్మపురి నరసింహ శతకం, నృకేసరి శతకం రచించిన శేషప్ప కవి తెలుగు సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలకు విశేష సేవలందించారని పేర్కొన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న బుద్ధ విగ్రహం తరహాలో చింతామణి చెరువు మధ్యలో లేదా కట్టపై భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.అలాగే చెరువు కట్ట వెంట ఫుట్‌పాత్, విద్యుద్దీపాలు, పచ్చదనం, బెంచీలు ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాకింగ్ ప్రదేశంగా, యాత్రికులకు ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.పుష్కరాలకు దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం,పర్యాటక శాఖ,ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని పుష్కర నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టాలని ఉమామహేష్ విజ్ఞప్తి చేశారు.

సైబర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్ గుర్తింపు



ప్రజాపక్షం/ముత్తారం: సైబర్ పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న ఒక విలువైన మొబైల్ ఫోన్‌ను రికవరీ చేసి, దానిని బాధితుడికి అందజేసినట్లు ముత్తారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రవికుమార్ తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని మిర్జాంపేట గ్రామానికి చెందిన గోపు సాగర్ ఇటీవల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు.దీనిపై ఆయన ముత్తారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్. రవికుమార్ పర్యవేక్షణలో పోలీసులు సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫోన్ ఎక్కడ ఉందో విజయవంతంగా గుర్తించారు.జాడ తెలిసిన అనంతరం ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని,సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు సాగర్‌కు ఎస్ఐ రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. పోగొట్టుకున్న తన ఫోన్‌ను అతి తక్కువ కాలంలోనే వెతికి పట్టుకున్నందుకు బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు ప్రత్యూష,శ్వేత,తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం అభివృద్ధిపై బిఆర్ఎస్ సమరశంఖం



ప్రజాపక్షం/పెద్దపల్లి : మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ నిరసన దీక్ష నిర్వహించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ దీక్షను ప్రారంభించి ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంతర్గాం మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని చందర్ గుర్తుచేశారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండుమూడేళ్లుగా మండలంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. కీలక అభివృద్ధి పనులు ఎక్కడ? మంచిర్యాల నుంచి అంతర్గాం వరకు గోదావరి వంతెన నిర్మాణం, పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఖుర్జీ భూముల పట్టాల పంపిణీ, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు వంటి కీలక పనులు పెండింగ్‌లో ఉన్నాయని చందర్ పేర్కొన్నారు. గతంలో మంజూరు చేయించిన ఈ పనులు ప్రారంభం కాకపోవడంతో మండలం అభివృద్ధిలో వెనుకబడుతోందని విమర్శించారు.

హామీలు అమలు చేయాలి : అంతర్గాం నుంచి మంచిర్యాలకు వంతెన నిర్మాణం చేపట్టాలని,పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని,ఖుర్జీ భూముల పట్టాలను రైతులకు అందజేయాలని, ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణాన్ని చేపట్టాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. మురళీధర్ రావు, విజయ రెడ్డి, కౌశిక హరి, లక్ష్మీనారాయణ, హరీష్ రెడ్డి, సమ్మయ్య యాదవ్, మారుతీమాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సింగరేణిలోని ఐదు గనులకు జాతీయస్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు



ప్రజాపక్షం/రామగిరి : సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా.. సింగరేణి సంస్థ చైర్మన్ ఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి ఈ అవార్డులను అందుకున్నారు.ప్రతిష్టాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్న గనులలో..శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే ఎన్‌టీ, ఆర్‌కే6 ఇంక్లైన్, సత్తుపల్లి ఏరియాకు చెందిన జేవీఆర్ ఓసీ2, బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఖైరీగూడ ఓసీ, రామగుండం3కి చెందిన ఆర్‌జీఓసీ1 గనులు ఉన్నాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్‌ను ఇస్తుంది.అత్యుత్తమ స్టార్ రేటింగ్ సాధించిన గనుల యాజమాన్యాలను అభినందిస్తూ అవార్డులను..అందిస్తూ ఉంటారు.ఇలా స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలోపై 84 అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుంచి వచ్చిన పరిశీలక బృందం ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతుంది. ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటి నుంచి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రెటరి శ్రీ సనోజ్ కుమార్ ఝా, కోల్ కంట్రోలర్ సతీష్ కుమార్, కోల్ ఇండియా సీఎండీ సాయిరాం, సింగరేణి సంస్థ డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్,మధుసూదన్, శ్రీనివాస్, నరేందర్, శ్రరాజేశ్వర్,కె.శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం మండలంలో పోలీసుల జులుం నడుస్తోంది

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పోలీసులంతో నడుస్తుందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కడ చూసినా కూల్చివేతలు,ఇసుక దందాలు, బూడిద దందాలతో అక్రమంగా డబ్బులు వెనకేసుకుంటున్నారని ఆరోపించారు.అలా సంపాదించిన డబ్బుతో పోలీసు వ్యవస్థను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటూ,ప్రతిపక్ష నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను సైతం పోలీసులచే తొలగింపజేస్తున్నారని మండిపడ్డారు.ప్రజా సమస్యలను ప్రతిపక్షాలు లేవనెత్తకుండా, ప్రజల గొంతుకలను అణిచివేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.అంతర్గాం మండలంలో ప్రజాపాలన కంటే కాంగ్రెస్ పార్టీ పోలీసు వ్యవస్థను ఉపయోగించుకొని రాజకీయాలు చేయడమే ఎక్కువగా కనిపిస్తోందని అన్నారు.ఇచ్చిన హామీలను నెరవేర్చలేని అసమర్థ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రతిపక్ష నాయకులపై పోలీసుల ద్వారా జులుం ప్రదర్శిస్తున్నారని, ప్రతిపక్షాలు నిర్వహించే సభలు, సమావేశాలను అడ్డుకోవడానికి అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలో గత మూడు సంవత్సరాల కాలంలో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కౌశిక హరి, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మేకల సమన్న,అధికార ప్రతినిధి జహిద్ పాషా, అంతర్గాం మండల అధ్యక్షుడు కోల సంతోష్, మూల విజయ రెడ్డి,మాజీ ఎంపీటీసీ కొలిపాక మధుకర్ రెడ్డి, పెద్దంపేట సర్పంచ్ శ్రీనివాస్,పెద్దంపేట ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,వార్డ్ మెంబర్స్,మాజీ సర్పంచులు మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



ప్రజాపక్షం/రామగిరిః రామగిరి మండలం రామయ్యపల్లె గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న అప్పాల ఐలయ్యను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.అనంతరం ఇటీవల మరణించిన దాడి శంకరయ్య కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.నాగేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ పొన్నం మధు గౌడ్ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.బేగంపేట గ్రామంలో ఇటీవల మరణించిన సందెల లింగయ్య,శ్రీధర్ల కొమురయ్య చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: బైండోవర్ షరతులు ఉల్లంఘించిన మహిళకు 60 వేల రూపాయలు .జరిమానా విధించినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అధికారి రేండ్ల విజెందర్ కుమార్ విలేకరుల ప్రకటనలో వెల్లడించారు.సోమవారం నారాయణపూర్ గ్రామానికి చెందిన నిందితురాలు గతంలో అనరాసి పోచవ్వ భర్త సైలూను గతంలో బైండోవర్ చేసి గుర్తించారు.బైండోవర్ షరతులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడి యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని సీఐ విజెందర్ అన్నారు.

హరిదాస్‌నగర్‌లో పోలీసుల నిఘా..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: నేరాల నియంత్రణ కోసమే సీసీ కెమెరాలు పని చేస్తాయని రాజన్నసిరిసిల్లా డీఎస్పి నాగేంద్రచారి అన్నారు. కమ్యూనిటి పోలీసింగ్‌లో భాగంగా గ్రామ పంచాయితీ సహకారంతో ఏర్పాటు చేసిన ఎనిమిది కెమెరాలను సోమవారం ప్రారంభించారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు తోడ్పడతాయని అన్నారు.రాజన్నసిరిసిల్లా డిఎస్పి నాగేంద్రచారి చేతుల మీదుగా ప్రారంభించగా సర్పంచ్ చిర్రం నాగరాజు ,ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్,ఎస్ఐ రమేష్‌గౌడ్,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సర్సయ్య,ఏఎంసీ చైర్మెన్ దేవనంద్,ఉపాధ్యక్షుడు నందికిషన్,షేక్ గౌస్ ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

కోతుల బెడదతో హరిపురం గ్రామస్తుల బెంబేలు!

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా మండలం హరిపురం గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సోమవారం గ్రామంలోని పలు ఇళ్లపైకి,ప్రహరీ గోడలపైకి కోతులు గుంపులుగా చేరడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ఎక్కడ చూసినా కోతుల సంచారం కనిపిస్తుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలోని ఇళ్లపై, ఇంటి పరిసరాల్లో కోతులు స్వేచ్ఛగా సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.ఒకేసారి పెద్ద సంఖ్యలో కోతులు ఇళ్లపైకి చేరుతుండటంతో పిల్లలు,వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కోతుల సంచారం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.కోతుల బెడదపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో కోతుల సంచారాన్ని నియంత్రించేందుకు అటవీశాఖ అధికారులు,గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.కోతులను సురక్షితంగా పట్టుకుని జనావాసాలకు దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రజలకు ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు అప్రమత్తమై సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు హరిపురం గ్రామాన్ని సందర్శించి కోతుల బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

యువకుడి మృతిపై విచారణ



ప్రజాపక్షం/ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన వేముల వినీత్ అనే యువకుడు ఆగస్టు 28వ తేదీన మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్య అధికారి ఆదేశాల మేరకు వైద్యప రమైన విచారణ చేపట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. నీలారపు శ్రీనివాస్ తెలిపారు. విచారణలో భాగంగా మృతుడు మరణానికి ముందు ఎక్కడెక్కడ వైద్య చికిత్స పొందారు,ఆయా ఆసుపత్రుల్లో ఎలాంటి చికిత్స అందించారు, చికిత్స సమయంలో ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే అంశాలపై వివరాలు సేకరిస్తు న్నట్లు పేర్కొన్నారు.సోమవారంమొదట రాజారం గ్రామాన్ని సందర్శించి మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నా మని, స్థానికంగా వైద్యం అందించిన వైద్యుడిని కలిసి చికిత్సకు సంబంధించిన సమాచారం సేకరిం చామని తెలిపారు. అదేవిధంగా ధర్మపురిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో సంబంధిత ఫిజీషియన్‌తో సమావేశమై మృతుడికి అందించిన వైద్యం, అప్పటి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు సేకరించినట్లు వెల్లడిం చారు.తదుపరి విచారణలో భాగంగా అవసరమైన వైద్య రికార్డులు,చికిత్సకు సంబంధించిన పూర్తి వివరా లను సేకరించి, యువకుడి మరణానికి గల కారణా లపై సమగ్రంగా పరిశీలన జరిపిన అనంతరం నివేది కను జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కి సమర్పించనున్నట్లు డా. ఎన్. శ్రీనివాస్ తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా గన్ని సంచుల డబ్బులు ఇప్పించాలి

ప్రజాపక్షం/మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో తనకు రావాల్సిన గన్ని సంచుల డబ్బులను ఇప్పించా లని కోరుతూ మండల కేంద్రంకు చెందిన కౌలు రైతు కోడూరి లావణ్య భిక్షపతి ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. కేంద్రంలో గన్నీ సంచుల కొరత ఉందని రైతులే కొనుగోలు చేసు కుని తీసుకువస్తే డబ్బులు చెల్లిస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పా రని, నెలలు గడుస్తున్న తనకు రావాల్సిన 10000 రూపాయల గన్ని సంచులు డబ్బులను తనకు చెల్లించడం లేదని మార్క్‌ఫెడ్ అధి కారులకు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని, తన విన్నపాన్ని దృష్టిలో ఉంచుకొని మార్క్‌ఫెడ్ ద్వారా డబ్బులు చెల్లించాలని వినతి పత్రంలో కోరారు.

కళా సమితి స్థలం పరిరక్షణకు కళాకారుల పోరుబాట



ప్రజాపక్షం/మెట్‌పల్లిః మెట్‌పల్లి పట్టణంలో కబ్జా కు గురైన లలిత కళా సమితి స్థలాన్ని పరిరక్షించా లని డిమాండ్ చేస్తూ కళాకారులు పోరుబాట పట్టారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిరస నగా నవంబర్ 4,5,6 తేదీల్లో మూడు రోజుల పాటు రిలే నిరసన దీక్షలు నిర్వహించనున్నట్లు లలిత కళా సమితి ప్రతినిధులు తెలిపారు.ప్రతి రోజూ ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పాత బస్టాండ్ లోని శాస్త్రి చౌరస్తా వద్ద ఖాదీ ప్రధాన గేటు పక్కన ఏర్పాటు చేసిన దీక్షా స్థలంలో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.లలిత కళా సమితి, అనుబంధ కళా సంస్థల ఆధ్వర్యంలో ఈ నిరస నలు కొనసాగనున్నాయి.ఈ సందర్భంగా కళాకా రుల ఆత్మగౌరవ పోరాట గీతాన్ని ఆవిష్కరిం చారు. సంస్థకు చెందిన స్థలాన్ని పరిరక్షించేం దుకు అధికారులు తక్షణమే స్పందించాలని, ఆక్ర మణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి పాత తాలూకా ప్రాంత కళాకారులకు న్యాయం జరి గేలా సంస్థ స్థలాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో లలిత కళా సమితి అధ్యక్షుడు గోధూరు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య, సహాయ కార్యదర్శి డీఎల్ఎన్ వర్మ,జాయింట్ సెక్రటరీ మర్రి భాస్కర్,క్రాంతి కుమార్,రాజారం లలిత కళా సమితి, మెట్‌పల్లి పాత తాలూకా ప్రాంత కళాకారుల సమాఖ్య ప్రతినిధులు తదిత రులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: దినేష్



ప్రజాపక్షం/ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తీగల ధర్మారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన సల్లూరి జలజ, మారాజు లక్ష్మి ఇళ్ల నిర్మాణాలకు సోమవారం జగిత్యాల జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్ల మంజూ రుపై సరైన శ్రద్ధ చూపలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి అశోక్, ధర్మపురి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, రాయపట్నం సర్పంచ్ రాందేవ్ మొగిలి, దోనూరు సర్పంచ్ దాసరి పురుషోత్తం, ప్రభా కర్, గంధం గంగయ్య, ఎండీ రషీద్, జలజ, నీలిమ, సత్తయ్య, ఎండీ సెంషు, గంధం రమేష్, గంధం రాజయ్య, కమలాకర్ రావు తదితరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానాన్ని పునఃసమీక్షించాలి



ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం ఃి తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులో భాగంగా రూపొందించిన రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించి మాల సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరుతూ జగి త్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్ ను మాల సామాజిక వర్గ సంఘాల ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజే శారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లా డుతూ గ్రూప్3 ఉద్యోగాల 100 పాయింట్ల రోస్టర్‌లో మాల వర్గానికి 22వ పాయింట్ వద్ద తొలి అవకాశం కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల మాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గే పరిస్థితి ఉందని పేర్కొంటూ,రోస్టర్ విధానాన్ని పారదర్శకంగా సవరించి అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని వారు కోరారు.ఈ సమస్యను జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని డీటీకి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల మాల సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్పి భూముల పరిరక్షణకు పోరాటం తప్పదు!

ప్రజాపక్షం/మెట్‌పల్లి ఃి మెట్‌పల్లిలోని ఎస్సారెస్పీ కార్యాలయ భూములు, సమీపంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నా మని ఎస్సారెస్పీ రిటైర్డ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, ఎస్సారెస్పీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి నేమూరి లక్ష్మ య్య స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ యత్నాలను అడ్డుకోవా లని, రిటైర్డ్ ఉద్యోగుల నివాస స్థలాలకు నష్టం కలి గించే ప్రయత్నాలను విరమించుకోవాలని హెచ్చరిం చారు. సోమవారం మెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పోచంపాడు ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోని అనేక గ్రామాలకు సాగునీరు అందిస్తూ లక్ష లాది మంది రైతులకు నీటిపారుదల శాఖ సేవలంది స్తోందన్నారు. లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంలో కీలకమైన మెట్‌పల్లి ఎస్సారెస్పీ కార్య నిర్వాహక కార్యాలయ భూములు, ఆస్తులను పరిర క్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యా లయ నూతన భవన నిర్మాణ పనులకు కొందరు అడ్డం కులు సృష్టించడంతో పాటు, సమీపంలోని రిటైర్డ్ ఉద్యోగుల నివాస స్థలాలకు నష్టం కలిగించే ప్రయ త్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవ హారంపై సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలి పారు.గతంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచు కుని స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు తన సొంత పట్టా భూములను ఎలాంటి ప్రతిఫలం ఆశించ కుండా మెట్‌పల్లి నీటిపారుదల శాఖ కార్యాలయం, సిబ్బంది నివాస క్వార్టర్ల ఏర్పాటుకు విరాళంగా ఇచ్చా రని గుర్తుచేశారు. కార్యాలయ అవసరాలకు కేటా యించిన భూములను ఇతర ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలకు బదిలీ చేయడానికి ప్రయత్నిస్తే తిరిగి స్వాధీనం చేసుకుంటానని అప్పట్లోనే ఆయన హెచ్చ రించిన విషయాన్ని గుర్తుచేశారు.గతంలో ప్రభుత్వ క్వార్టర్లలో నివసించిన రిటైర్డ్ ఉద్యోగులు,అవి శిథిలావ స్థకు చేరడంతో 1990వ దశకంలో ఎస్సారెస్పీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకున్నా రని వివరించారు.

అప్పటి నుంచి నివాసితులు విద్యుత్ బిల్లులు, మున్సి పల్ ఇంటి పన్నులు చెల్లిస్తున్నారని పేర్కొ న్నారు.2003–04లో జీవో నంబర్లు 136, 416 మార్గదర్శకాల ప్రకారం మార్కెట్ విలువ చెల్లింపు ప్రాతిపదికన ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఇకపై ఎవరైనా ఆక్రమణలకు ప్రయత్నిస్తే ఎస్సారెస్పీ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని నేమూరి లక్ష్మ య్య హెచ్చరించారు.

ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని పాత దామరాజు పల్లి గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంచినీళ్ళ బావి నుండి గోదావరి పుష్కర ఘాట్ వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టా లని కోరుతూ గ్రామ సర్పంచ్ రోండ్ల రాజేశ్వరి రాజారెడ్డి ఆధ్వ ర్యంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ను సోమవారం కలి శారు.ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్ ను కలిసి వర్షాకాలంలో గోదావరి నదికి వెళ్లేందుకు గ్రామస్తులు రైతులు పడుతున్న ఇబ్బం దులు అనేకమని,సిసి రోడ్డు నిర్మాణంతో గోదావరి నది వచ్చే భక్తు లకు,గ్రామస్తులకు ఇబ్బందులు తొలగిపోతాయని విన్నవించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాతదామరాజు పల్లి గ్రామస్తులు ఉన్నారు.

కెడిసిసి బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ : మల్లాపూర్ కేడీసీసీ బ్యాంకు నందు రైతు లకు, ఖాతాదారులకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవా లని ఏజీఎం మహేష్, బ్యాంక్ మేనేజర్ అంజయ్య అన్నారు.ఈ మేరకు సోమవారం రోజున గుండంపల్లి గ్రామంలో జన సురక్ష స్కీమ్,రీ కేవైసీ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏజీఎం మహేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన,ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలపై అవగా హన కల్పించి,అర్హులైన వారికి పథకాలలో పేర్లు నమోదు చేయించి ఖాతాదారులకు రికేవైసీ ప్రక్రియను చేపట్టి ప్రజలకు సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మహేష్, బ్రాంచ్ మేనే జర్ అంజయ్య,ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్,సిబ్బంది శ్రవణ్ ప్రవీణ్ రంజిత్,సిరిపూర్ సీతామో రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కుస్తాపూర్ వారసంతను విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ఃి మండలంలోని కుస్తా పూర్ గ్రామంలో ఈనెల 07 తేదీ శనివారం రోజున గ్రామ ప్రజల సౌకర్యార్థం గ్రామపంచా యతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వారసంతను ప్రారంభిస్తున్నామని, వ్యాపార సముదాయ దుకా ణాలు, గ్రామస్తులు చుట్టు గ్రామాల ప్రజలు పాల్గొని,వారసంతను విజయవంతం చేయాలని సర్పంచ్ జెల్లా రాజేశ్వర్ అన్నారు.ఈ మేరకు సోమవారం రోజున మల్లాపూర్ మండల కేంద్రంలో జరిగిన వారసంతలొ వ్యాపారస్తులకు, పాలకవర్గం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందించి,వారసంతకు రావాలని ఆహ్వానిం చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ పెద్దలు,తదితరు లున్నారు.

మెట్‌పల్లి ప్రజా సమస్యలపై బిజెపి నిరాహార దీక్ష



ప్రజాపక్షం/మెట్‌పల్లి ఃి మెట్‌పల్లి పట్టణంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్ తెలిపారు.సమీకృత మార్కెట్ నిర్మాణం ప్రారంభించాలని, శిథిలావస్థకు చేరిన కొత్త బస్టాండ్ స్థానంలో నూతన భవనం నిర్మించాలని, పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, వార్డుల్లో సీసీ రోడ్ల పునర్నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారం చేపట్టాలని కోరారు.ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొంటూ,నిరాహార దీక్షకు ప్రజలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని నవీన్ పిలుపునిచ్చారు.

మహా పాదయాత్రకు సర్వం సిద్ధం!



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 3న నిర్మల్ పట్టణంలో నిర్వహించనున్న "లోక్‌తంత్ర బచావో – అరాచకత హటావో" మహా పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహా పాదయాత్ర నేపథ్యంలో నిర్మల్ పట్టణం కాషాయ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో కాషాయమయంగా మారింది. నగర మంతా బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.ఈ మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు హాజరుకానుండటంతో కార్యక్రమంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ సంస్థల గౌరవం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రజలకు పిలుపునిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ మహా పాదయాత్రకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, బీజేపీ కార్యకర్తలు,నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.నిర్మల్ గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడేలా..ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నిర్మల్‌లోనే పర్మినెంట్ ఫేస్‌మేకర్ అమరిక!

హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు.. అత్యాధునిక గుండె వైద్య సేవలు స్థానికంగానే

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నిర్మల్ జిల్లా ప్రజలకు శుభవార్త. ఇప్పటివరకు అత్యాధునిక గుండె వైద్య చికిత్సల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా,ఇకపై అలాంటి వైద్య సేవలు నిర్మల్‌లోనే అందుబాటులోకి వస్తున్నాయి.నిర్మల్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ రమేష్ రెడ్డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు డాక్టర్ రమేష్ రెడ్డి వెల్లడించారు.గుండె వైద్య రంగంలో 30 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి,తిరుమల నర్సింగ్ హోమ్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో లభించే అత్యాధునిక వైద్య సేవల్లో భాగంగా పర్మినెంట్ పేస్‌మేకర్ అమరిక శస్త్రచికిత్సలను సైతం ఇకపై నిర్మల్‌లోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఇటీవల లక్ష్మణచాంద మండలం పీచర ధర్మరం గ్రామానికి చెందిన 75 ఏళ్ల మల్లవ్వ గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిని సంప్రదించారు.వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమెకు పర్మినెంట్ పేస్‌మేకర్ అమర్చాల్సిన అవసరం ఉందని వైద్యులు గుర్తించారు.దీంతో డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య నిపుణుల బృందం నిర్మల్‌లోనే అవసరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పేస్‌మేకర్ అమర్చింది. గుండె స్పందన సాధారణంగా ఉండేందుకు పేస్‌మేకర్ కీలకంగా పనిచేస్తుంది. గుండె స్పందన వేగం తగ్గినప్పుడు లేదా విద్యుత్ సంకేతాల్లో సమస్యలు ఏర్పడినప్పుడు వైద్యుల సూచన మేరకు ఈ పరికరాన్ని అమర్చుతారు.ఈ తరహా చికిత్స కోసం గతంలో హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, అక్కడ ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం మల్లవ్వ ఆరోగ్య పరిస్థితి బాగుందని, ఆమె కోలుకుంటున్నట్లు డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లాలోనే అత్యాధునిక గుండె వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సమయాన్ని ఆదా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి పేస్‌మేకర్ అమర్చిన డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి, ఆయన వైద్య బృందానికి మల్లవ్వ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ప్రజలు ఈ వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమేష్ రెడ్డి కోరారు.

ముందస్తు అరెస్టులతో ఆప్ పోరాటాన్ని ఆపలేరు!



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ అన్నారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనను అడ్డుకుంటామని ఆప్ రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు నిర్మల్‌లో ని తన నివాసంలో సయ్యద్ హైదర్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వినోద్, కోశాధికారి అబ్దుల్ సాధిక్ అక్కడ ఉన్నారు. అనంతరం ఆప్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, కాళేశ్వరం ప్రాజెక్టు, పెట్రోల్ ధరలు,ఉద్యోగాల కల్పన, రూ.15 లక్షల హామీ, మణిపూర్ హింస,మహిళల భద్రత, ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు వంటి 17 అంశాలపై కేంద్ర హోం మంత్రిని ప్రశ్నించామని తెలిపారు.ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని విమర్శించారు. ప్రధానమంత్రి అయినా,హోంమంత్రి అయినా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు.ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని సయ్యద్ హైదర్ తెలిపారు.

నిర్మల్‌లో కాషాయ సందడి.. బిజెపి మహా పాదయాత్ర!

50 వేల మందితో భారీ జనసమీకరణ.. ముఖ్య అతిథిగా సునీల్ బన్సల్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీజేపీ మంగళవారం నిర్మల్‌లో మహా పాదయాత్ర నిర్వహించనుంది. బిజెఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.నిర్మల్,ముధోల్,ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి సుమారు 50 వేల మందిని సమీకరించాలని పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి,పవార్ రామారావు పటేల్,జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగింకచి, ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించడమే పాదయాత్ర ఉద్దేశమని బీజేపీ నాయకులు తెలిపారు. సునీల్ బన్సల్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నిర్మల్‌కు రానున్నారు. ఇందుకోసం ప్రత్యేక హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అనంతరం శాంతినగర్ చౌరస్తా నుంచి శివాజీ చౌక్ మీదుగా వివేక్ చౌక్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగనుంది.సునీల్ బన్సల్ తొలి నిర్మల్ పర్యటన నేపథ్యంలో నగరంలోని ప్రధాన కూడళ్లను కాషాయ జెండాలు, ఫ్లెక్సీలు,తోరణాలతో అలంకరించారు.భారీ పాదయాత్ర నేపథ్యంలో నిర్మల్‌లో రాజకీయ సందడి నెలకొంది.

కేరమేరి ఎంపిడిఒగా సాయిరాం గౌడ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం/కేరమేరి : కేరమేరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ)గా సాయిరాం గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న కృష్ణారావు అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో సాయిరాం గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కృష్ణారావు నూతన ఎంపిడిఒ సాయిరాం గౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు. అనంతరం సాయిరాం గౌడ్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాపక్షం/కాసిపేట : ప్రజావాణి అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు కాసిపేట ఎంపిఒ తెలిపారు. సోమవారం కాసిపేట మండల ప్రజా పరిషత్ (ఎంపిపి) కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మూడు దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ఎంపిఒ మాట్లాడుతూ అందిన దరఖాస్తుల్లో రెండు రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ వివాదాలు కాగా, మరొకటి పంట చేనులోకి వస్తున్న మురుగు కాలువ నీటిని అడ్డుకోవాలని కోరుతూ వచ్చినట్లు వివరించారు. ఈ అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి విచారణ, తక్షణ పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు. బాధితుల సమస్యలను క్షేత్రస్థాయి లో పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులు

కలెక్టర్ హరిత

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్ బాల్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా జట్టు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోని సన్ ఫ్లవర్ వేదిక్ పాఠశాలలో అక్టోబర్ 29 నుంచి 31 వరకు నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్14 బాలుర ఫుట్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో క్రీడారంగంలో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తిరుపతి, జిల్లా విద్యాశాఖ పర్యవేక్షకులు శ్రీనివాస్, జట్టు మేనేజర్ ఎం రమేష్, కోచ్ బి రాజశేఖర్, ఖేలో ఇండియా కోచ్ కడతాల రాకేష్, పిడి లు విద్యాసాగర్, ప్రవీణ్, ప్రభాకర్, చిరంజీవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనూసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.35 లక్షల తో గోశాల నిర్మాణం

ప్రజాపక్షం/ఖైంసా : మహారాష్ట్ర లో ని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా లోని మద్నాపూర్ గ్రామం లో గంగేశ్వర్ మహారాజ్ ఆశ్రమం లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తన స్వంత డబ్బులు 35 ల క్ష ల తో గోశాల ను నిర్మించారు.సోమవారం ఉదయం వేళ గోశాల ను ప్రారంభించి, గంగేశ్వర్ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు.అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోశాల నిర్మాణం చేయడం జరిగిందన్నారు.గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు గోవులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.. కార్యక్ర మం లో ప్రముఖ మహారాజ్ లతో పాటు మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి,నాయకులు చక్రధర్ పటేల్, వెంగల్ రావ్, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజా పక్షం/నిర్మల్ టౌన్ : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా,ప్రజలు విద్య,వైద్యం,ఇందిరమ్మ ఇండ్లు,పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు,రాథోడ్ రమేష్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

మూడవ విడత అక్రిడిటేషన్ కార్డులు త్వరగా జారీ చేయాలి

ప్రజాపక్షం/మంచిర్యాల : అర్హులైన జర్నలిస్టులకు మూడవ విడత అక్రిడిటేషన్ కార్డులను త్వరితగతిన జారీ చేయాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు మూడవ విడత అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం త్వరలోనే జర్నలిస్టుల హెల్త్ కార్డుల పునరుద్ధరణ ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో, దానికి అక్రిడిటేషన్ కార్డు ప్రామాణికం కానుందని పేర్కొన్నారు. కార్డుల జారీలో ఆలస్యమైతే జర్నలిస్టులు వైద్య సదుపాయాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి రెండు విడతల్లో మిగిలిపోయిన అర్హుల దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నందున, వెంటనే జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి త్వరితగతిన కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, దేగ సత్యం, పార్వతి సురేష్, అలుగువెల్లి రమేష్ రెడ్డి, ఐనంపూడి నవీన్, సదానందం పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాపక్షం/వాంకిడి : వాంకిడి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణిలో ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దుర్గం నిఖిల్, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు దుర్గం సందీప్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు, వంతెనలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సోనాపూర్, రోహిణిగూడ, కనర్గం, పాటగూడ, ఎనోలి గ్రామాల్లో రహదారుల సమస్యలను పరిష్కరించాలని, బంబారా, కొస్తారా, పిప్పర్‌గోంది గ్రామాల్లో వంతెనలు నిర్మించాలని కోరారు. రవాణా సౌకర్యాలు సరిగా లేక అత్యవసర సమయాల్లో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

6న మండల సమీక్ష సమావేశం

ప్రజాపక్షం / కౌటాలః మండలంలోని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులతో ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే సమీక్ష సమావేశాన్ని 6వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో మండల అభివృద్ధి పనులు, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు, సర్పంచ్‌లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం / మందమర్రిః మందమర్రి ప్రాంతంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు చేపట్టాలని బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా కార్యదర్శి మేడి రాజు మాట్లాడుతూ మున్సిపాలిటీకి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. స్థానిక విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని, ఊరు మందమర్రి వాగుపై వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి 63పై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వెహికల్ అండర్‌పాస్‌తో కూడిన క్లోజ్డ్ బ్రిడ్జి నిర్మించాలని స్పష్టం చేశారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి ధర్నా

ప్రజాపక్షం / దండేపల్లిః వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆరోపిస్తూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి ధర్నాకు దిగిన ఘటన మండలంలోని లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మగ్గిడి మహేందర్ తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీరా సమయానికి మోసం చేశాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ ఆదివారం రాత్రి నుంచి ప్రియుడి ఇంటి ముందు నిరసన కొనసాగిస్తోంది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల సభ్యులు, గ్రామ పెద్దలు సమావేశమై సమస్య పరిష్కారానికి పంచాయితీ నిర్వహిస్తున్నారు.

బియ్యం ధరలకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాపక్షం/నిజామాబాద్ ః అడ్డగోలుగా పెరుగుతున్న బియ్యం ధరలకు అడ్డుకట్ట వేయాలని కిలో బియ్యం రూ.66 కే విక్రయించాలని ఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మిల్లర్లు, హోల్‌సేల్ రిటైల్ వ్యాపారులు కుమ్మక్కై బిపిటి బియ్యాన్ని అధిక ధరకు విక్రయిస్తూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని, పెరుగుతున్న ధరలకనుణంగా మధ్యతరగతి ప్రజలు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

పెంబి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/పెంబి ః పెంబి మండలాన్ని కరువు ప్రభావిత మండలంగా గుర్తించి అధికారికంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం మండలానికి చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడిందని రైతులు పేర్కొన్నారు.సాగు చేసిన పంటలకు సరిపడా నీరు అందకపోవడం,పెట్టుబడి ఖర్చు లు పెరగడం, పంటల దిగుబడిపై అనిశ్చితి నెలకొనడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పెంబి మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా గుర్తించి, ప్రభుత్వానికి తగిన నివేదికలు పంపించాలని కోరారు. కరువు మండలంగా ప్రకటించి రైతులకు పంట నష్టపరిహారం, పంటల బీమా, ఇతర ప్రభుత్వ సహాయ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం ద్వారా తగిన న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు నరేందర్ రెడ్డి, వెంకటేష్, గంగారెడ్డి, బై రెడ్డి రాజేందర్,రాజుబాబు, పుప్పాల రవి, తనజీ రాజేందర్, బోసు శ్రీనివాస్, సబ్బీర్ ఖాన్, కృష్ణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేతలను అభినందించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ఇటీవల వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో మొదటి బహుమతి సాధించిన మంచిర్యాల క్రీడాకారులను మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అభినందించారు. సోమవారం మంచిర్యాలలోని ఎమ్మెల్యే నివాసంలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్ సాఫ్ట్‌బాల్ విజేతలు ఎమ్మెల్యేను కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో గెలుపొంది డిసెంబర్ నెలలో రాజస్థాన్‌లో జరగనున్న ఆలిండియా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన దేనియల్, కమల్, ప్రదీప్, సాయిప్రభాస్, అఖిల్, అభిరామ్, సిర్కార్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించి అక్కడ కూడా ప్రతిభ కనబరిచి మంచిర్యాల నియోజకవర్గానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన కిట్లను అందిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా క్రీడాకారులకు హామీ ఇచ్చారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తు వారి ప్రతిభకు అండగా నిలుస్తు క్రీడారంగ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ మధుకర్, కార్పొరేటర్లు ఎంబడి కుమారస్వామి, కాకుల వరలక్ష్మి, యువరాజ్, నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ః సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, కోల్ మైన్స్ పెన్షనర్ల సౌకర్యార్థం సిఎంపిఎఫ్ గోదావరిఖని ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిజిఎం(పర్సనల్) ఎస్ అనిల్ కుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు శ్రీరాంపూర్ జిఎం కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నవంబర్‌లో విశ్రాంత ఉద్యోగులు, వారి భార్యలు జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో గనులు, విభాగాల సంక్షేమ అధికారులు, సీఎంపీఎఫ్ సిబ్బందికి మొబైల్ యాప్ ద్వారా ధ్రువీకరణ పత్రాల పునరుద్ధరణపై శిక్షణ ఇవ్వనున్నారు. నేరుగా శిబిరానికి వచ్చే విశ్రాంత ఉద్యోగులు, కోల్ మైన్స్ పెన్షనర్లకు ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లను పునరుద్ధరించనున్నారు. నవంబర్ 1 నుంచి 30 వరకు శ్రీరాంపూర్‌తో పాటు మందమర్రి, బెల్లంపల్లి, భూపాలపల్లి, ఆర్‌జి 1, 2, 3 ప్రాంతాల్లో ఈ ప్రచార కార్యక్రమం కొనసాగనుంది. సిఎంపిఎఫ్ అధికారులు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కుమార్ కోరారు.

మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం రూ.925 కోట్ల నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. సోమవారం స్థానిక ఐబి చౌరస్తాలో మంచిర్యాల నగర అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి నిధులను మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టిపిసిసి ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, మున్సిపల్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, మార్కెట్ కమిటి చైర్మన్ రామగిరి బానేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హెచ్ టి పత్తి సాగుపై రైతులకు అవగాహన



ప్రజా పక్షం/పెంబి ః మండలంలోని రైతు వేదికలో హెచ్‌టి పత్తి సాగు వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.వ్యవసాయ అధికారులు ఈ సాగుతో ఎదురయ్యే సమస్యలు,పర్యావరణంపై పడే ప్రభావాలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం,జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి అసం రవి,సర్పంచ్ సత్యనారాయణ స్వామి,తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ప్రజా పక్షం/పెంబి : మండలంలోని వివిధ గ్రామాల్లో పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు.పెంబి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు వెన్నెల సూర్యనానమ్మ అనారోగ్యంతో మృతి చెందగా,ఇటిక్యాల గ్రామానికి చెందిన పాముల రవి, పుల్గం పాండ్రి గ్రామానికి చెందిన బిక్యా నాయక్ వివిధ కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న భూక్యా జాన్సన్ నాయక్ ఆయా బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టసమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి గంగారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బడుగు మల్లేష్, షబ్బీర్ ఖాన్, గాండ్ల శంకర్, చిన్నయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం / మందమర్రిః గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా సోమవారం మందమర్రిలోని ఎంజెపి, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గెస్ట్ ఉపాధ్యాయులకు కనీస వేతన స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పనిభారం ఎక్కువగా ఉన్నప్పటికీ సరైన వేతనాలు, సౌకర్యాలు లేకపోవడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించినప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రభుత్వం స్పందించి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సమాచార హక్కు చట్టం పరిరక్షణకు నూతన కార్యవర్గం

ప్రజాపక్షం / మందమర్రిః సమాచార హక్కు చట్టం పరిరక్షణ, పాలనలో పారదర్శకత లక్ష్యంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా, ఏరియా స్థాయి నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పెద్దల చంద్రకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా భూక్య భీమ శేఖర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కడారి సాయి కిరణ్, మందమర్రి ఏరియా అధ్యక్షుడిగా హరీశ్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా ఉపాధ్యక్షుడు భీమ శేఖర్ నాయక్ మాట్లాడుతూ పాలనలో జవాబుదారీతనం పెంచేందుకు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో సమాచారాన్ని పొందే విధానం, దరఖాస్తు ప్రక్రియపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సామాన్య పౌరులు తమ హక్కులను సద్వినియోగం చేసుకునేలా కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఫిర్యాదుల విభాగానికి రాని అర్జీలు

ప్రజాపక్షం / కౌటాలః మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఒక్క ఆర్జీ కూడా రాలేదని సూపరింటెండెంట్ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసినప్పటికీ ఈసారి ఎవరూ దరఖాస్తులు సమర్పించలేదన్నారు. ప్రజలు తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

నీషాన్ ఘాట్ కాలనీలకు పట్టాలు, వసతులు ఇవ్వాలి



ప్రజాపక్షం/ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లోని 170, నీషాన్ ఘాట్ కాలనీవాసులకు ఇండ్ల పట్టాలు, కనీస వసతులు కల్పించాలని కోరుతూ సిపిఐ జిల్లా కన్వీనర్ విలాస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. విలాస్ మాట్లాడుతూ కాలనీల్లో చేతిపంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్, ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. విమానాశ్రయం వల్ల ఇళ్లు పోతే ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే బోర్లను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రమౌళి, బాస్కర్, కేశవ్, కిష్టయ్య పాల్గొన్నారు.



ప్రజాపక్షం/ఆదిలాబాద్: ఆదిలాబాద్ మండలం అర్లి(బి) పంచాయతీ పరిధిలోని నిషాన్‌ఘాట్ 38 సర్వే నంబరులో నివసిస్తున్న 300 కుటుంబాలకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ధర్నాలో ఆయన మాట్లాడారు. 12 ఏళ్లుగా పేదలు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. త్వరలోనే సమస్యలు తీర్చక పోతే నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బికెఎంయు నాయకులు సూర్పం కృష్ణ, కుంటాల రాములు, రామదాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 109 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యల కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు సిఎం ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులకు వారి వినతులపై చేపట్టిన చర్యలపై సహేతుక వివరరాలతో లిఖితపూర్వకంగా సమాచారం తెలియజేయాలని, వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడిని పట్టుకున్న నిర్మల్ పోలీసులు

1.4 కిలోల బంగారం, 3 కిలోల వెండి రూ.9 లక్షల నగదు స్వాధీనం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన దారుణ హత్య కేసులో ప్రధాన నిందితుడిని నిర్మల్ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. హత్య అనంతరం భారీగా బంగారం, వెండి, నగదుతో పాటు కారులో మధ్యప్రదేశ్‌కు పారిపోతున్న నిందితుడిని సోన్ టోల్‌ప్లాజా వద్ద వలపన్ని అదుపులోకి తీసుకున్నారు.అతడి నుంచి సుమారు రూ.కోటి విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్‌కు చెందిన జోగిని సుధాకర్ స్వామి అనే వ్యక్తిని నిందితుడు కిరాతకంగా హత్య చేసి, అతని వద్ద ఉన్న విలువైన బంగారం, వెండి, నగదు, కారుతో పరారైనట్లు నిర్మల్ జిల్లా పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో అప్రమత్తమైన ఎస్పి జానకి షర్మిల వెంటనే పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు.ఎస్పి ఆదేశాల మేరకు నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి తన సిబ్బంది శ్రీనివాస్, సూర్యభాను, రఘు, శ్రీధర్‌లతో కలిసి సోన్ టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానిత వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో వేగంగా దూసుకొస్తున్న హరియర్ కారును పోలీసులు గుర్తించారు.పోలీసులను గమనించిన నిందితుడు తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు కారును వెంబడించి అడ్డుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.కారును తనిఖీ చేయగా భారీ మొత్తంలో బంగారం,వెండి,నగదు బయటపడ్డాయి. మొత్తం 1.4 కిలోల బంగారం, 3 కిలోల వెండి, రూ.9 లక్షల నగదుతో పాటు హరియర్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సొత్తు విలువ సుమారు రూ.కోటి ఉంటుందని అంచనా వేశారు.అనంతరం నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తు, వాహనాన్ని తదుపరి దర్యాప్తు నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో నిర్మల్ పోలీసులు చూపిన అప్రమత్తత, సమయస్ఫూర్తి మరోసారి పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.కేవలం అందిన సమాచారంతోనే రంగంలోకి దిగి, అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించి, అంతర్రాష్ట్ర స్థాయిలో పరారవుతున్న హత్య కేసు నిందితుడిని గంటల వ్యవధిలోనే పట్టుకోవడంపై ఎస్పి డాక్టర్ జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఐ లింబాద్రి, పోలీసు సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

దాహార్తి సమస్య తలెత్తకుండా ముందస్తు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో ఎక్కడ కూడా వేసవిలో దాహార్తి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బంధీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం పలు కీలక అంశాలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న వేసవి సీజన్‌లో ప్రతి నివాస ప్రాంతానికి ప్రజల అవసరాలకు సరిపడేలా రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగునీటి సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తే అవకాశాలున్నట్లుగా గమనిస్తే సంబంధిత ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాలతో తాగునీటిని అందించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ట్రైనీకలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జడ్పి సిఇఒ సాయగౌడ్, డిఆర్‌డిఒ సాయన్న, అధికారులు పాల్గొన్నారు.

చేంగల్ వైకుంఠధామంలో నిర్వహణ లోపం

ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో అంతిమ సంస్కారాల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించింది. గ్రామాల రూపురేఖలను మార్చాలనే సత్సంకల్పంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులు, ప్రస్తుత పాలకుల, అధికారుల పర్యవేక్షణ లోపంతో పూర్తిగా నిరుపయోగంగా మారుతున్నాయి. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామంలోని వైకుంఠధామం.చేంగల్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రస్తుతం చూస్తే అది ఒక స్మశానవాటికలా కాకుండా, కనీసం మనుషులు అడుగు పెట్టడానికి కూడా వీల్లేని విధంగా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అంతిమ సంస్కారాలకు వచ్చే జనాలు నిలబడటానికి కూడా చోటు లేని దుస్థితి నెలకొంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి కట్టిన షెడ్లు, నిర్మించిన మౌలిక వసతులు నేడు అడవిని తలపిస్తున్నాయి.గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలు నిర్వహించటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చేంగల్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ సిబ్బందికి, స్థానిక అధికారులకు గ్రామస్తులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ప్రజాసమస్యలను తీర్చాల్సిన సిబ్బంది కనీసం స్పందించక పోవటం, ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవటం గమనార్హం. 'అధికారులకు చెప్పి చెప్పి విసిగిపోయాం'అని స్థానికులు వాపోతున్నారు.ప్రభుత్వాలు మారినా ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాలు నిరంతరాయంగా కొనసాగాలి. కానీ చేంగల్ వైకుంఠధామం విషయంలో అది జరగడం లేదు. గత ప్రభుత్వం నిర్మించినప్పటికీ ప్రస్తుత నిర్వహణ బాధ్యతలను స్థానిక పంచాయతీ విస్మరించటం ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరుగా మార్చటమే అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మండల పరిషత్ అధికారులు స్పందించి చేంగల్ గ్రామంలోని వైకుంఠధామాన్ని ఆవరించిన ముళ్లపొదలను తక్షణమే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దీనికి శాశ్వత నిర్వహణ కమిటీని లేదా సిబ్బందిని కేటాయించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని కోరుతున్నారు.

గ్రామీణ పాలనపై ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల అధ్యయనం

ప్రజాపక్షం/నేరడిగొండ: సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై అధ్యయనంలో భాగంగా సోమవారం నేరడిగొండ మండలం కమారి గ్రామాన్ని ఐదుగురు ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఎస్ఎస్ శిక్షణాధికారుల బృందం (మనీషా నహోరా, ప్రద్యుమన్ సింగ్ బిట్టు, అక్షయ్‌కుమార్ శర్మ, అనురాగ్ విమల్ వర్మ, మోహిత్ అగర్వాల్) సందర్శించింది. పాఠశాలలు, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సంఘాల పనితీరును పరిశీలించారు. సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపిడిఒ గంగసాగర్ రెడ్డి అధికారులకు పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం వెంకట్‌రెడ్డి, కార్యదర్శి దత్తహరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల మహా ధర్నా



ప్రజాపక్షం/మావల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి నాయకుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించి మహా ధర్నా చేపట్టారు. లేబర్ చట్టాల ప్రకారం 70 శాతం పనులను స్థానిక కార్మికులకే ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళారీ వ్యవస్థను అరికట్టి సిఎస్‌సి సెంటర్లను రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ సాధించిన బాదావత్ సంతోష్



ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ : భీమ్‌గల్ మండలంలోని సికింద్రాపూర్‌కు చెందిన బాదావత్ సంతోష్ ఉన్నత విద్యపై ఆసక్తి, పట్టుదలతో పరిశోధన రంగంలో రాణించి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పట్టా సాధించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన సంతోష్ ఈ ఘనత సాధించడం గ్రామంతో పాటు మండలానికి గర్వకారణంగా నిలిచింది. రాజస్థాన్ రాష్ట్రం ఝున్‌ఝున్ జిల్లాలోని ఎస్‌జెజెటియు లో సోమవారం ఆయన డాక్టరేట్ పట్టా అందుకున్నారు. విశ్వవిద్యాలయంలో సంతోష్ 'భారత స్వాతంత్ర్య కాలంలో సాహిత్యంపై ప్ర భావం' అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. భారత స్వా తంత్రోద్యమ కాలంలో సాహిత్యం ప్రజల్లో జాతీయ భావాలను దేశభక్తిని, స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించటంలో పోషించిన పాత్ర ను పరిశోధనలో విశ్లేషించారు. ఈ అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. భవిష్యత్తులో వి ద్యా, పరిశోధన రంగాల్లో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/మోర్తాడ్ : నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో రైతులకు ఆర్‌పిఎల్ ఆధారిత శిక్షణలో నూనె గింజల సాగుని ప్రోత్సహించటం, తక్కువ నీటితో చిరుధాన్యాల సాగుని విస్తరించటంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ సహాయ వ్యవసాయ సంచాలకులు భీమ్‌గల్ రాధికా, మోర్తాడ్ మండల వ్యవసాయాధికారి హరీష్‌లు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భజలాలు తగ్గిపోయే అవకాశమున్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని, జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ఉద్యానవన అధికారి రాజాగౌడ్, ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యతను ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగు ప్రాముఖ్యతను కూడా రైతులకు తెలిపారు. కార్యక్రమంలో శెట్‌పల్లి సర్పంచ్ విజయ్, ఏఈఓ మహేష్ రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు

ప్రజాపక్షం / నడికూడ : నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదు క్యాంపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్హులైన పట్టభద్రుల నుండి క్లస్టర్ ఇన్‌చార్జ్ గుడికందుల శివ ఆధ్వర్యంలో ఓటరు నమోదు చేశారు.ఈసంధర్భంగా శివ మాట్లాడుతూ గ్రామంలో నవంబర్ 2023 లోపు డిగ్రీ,దానికి సమానమైన విద్యార్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జీలు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, యూత్‌నాయకులు పాల్గొన్నారు.

క్రిమి సంహారక మందు తాగి ఒకరు మృతి

ప్రజాపక్షం /వేలేరు : వేలేరు మండలకేంద్రానికి చెందిన మాడిశెట్టి జగదీశ్వరయ్య తండ్రి గుండయ్య 85 సంవత్సరాలు తనభార్య మరణం తరువాత ఒంటరి తనం అనుభవిస్తూ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ తేది 29,10,2026 రోజున క్రిమిసంహారక మందు తాగగా చికిత్స నిమిత్తం ముల్కనూర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ 01,11,2026 రోజున మృతిచెందగా అతని చిన్న కుమారుడైన మాడిశెట్టి సురేష్ వేలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అతని తండ్రి మృతదేహానికి పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అందించడం జరిగిందని ఎస్ఐ దూదిమెట్ల నరేష్ తెలిపారు.

పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఘన స్వాగతం



ప్రజాపక్షం/నెక్కొండ: నర్సంపేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్సీఇన్‌చార్జిగా తొలిసారిగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి విచ్చేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు కొమ్ము రమేష్ యాదవ్, బిఆర్ఎస్ నాయకుడు, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్ శాలువా కప్పి సత్కరించి సమావేశానికి ఆహ్వానించారు.

నెక్కొండలో గులాబీ బ్యానర్ల సందడి

ప్రజాపక్షం/నెక్కొండ: ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై చర్చించడంచేందుకు నెక్కొండ మండలంలో సోమవారం బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో బ్యానర్ల సందడి నెలకొంది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీ పడి ప్రధాన రహదారులు, కూడళ్లో భారీగా బ్యానర్లు ఏర్పాటు చేశారు. పార్టీ పట్ల తమ విధేయతను చాటుకోవడంతో పాటు నాయకుల దృష్టిలో పడేందుకు ఎవరికి వారు బ్యానర్లతో హడావుడి చేయడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది.

సింగరేణి కార్మికుల సొంతింటి కలను ఆపాద్దు

సిఐటియు జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి



ప్రజాపక్షం / శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చడంలో రాజకీయ ప్రయోజనాల కోసం జాప్యం చేయొద్దని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ ఒసిలో కస్తూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన బ్రాంచ్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సొంతింటి కల సాధన కోసం నాలుగేళ్లుగా పోరాడి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ప్రకటన చేయించామని తెలిపారు. రాజకీయ కారణాలతో ఆలస్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.గత ప్రభుత్వ హయాంలో రాజకీయ జోక్యంతో సింగరేణి నష్టపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాలను కొనసాగించడం తగదని పేర్కొన్నారు. కార్మికులపై ప్రేమ ఉందని చెప్పే బిజెపి నాయకులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి 12వ వేతన కమిటీ ఏర్పాటుపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినందున అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించి సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, పిట్ సెక్రటరీ సీపతి బానేష్, నాయకులు నరహరి రావు, శ్రీధర్, అఖిల్, బొజ్జ నవీన్, జగన్మోహన్ రెడ్డి, చిగురు లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే

ఎస్పి అశోక్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పేర్కొన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి అశోక్ కుమార్ సోమవారం ప్రజలనుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పికి నేరుగా వివరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను జిల్లా ఎస్పి తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఉన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్: జిల్లాలోని అటవీ భూములు, వన్యప్రాణుల పరిరక్షణకు పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం సిపి సాయిచైతన్యతో కలిసి అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం, వన్యప్రాణుల సంరక్షణ ఇతర అంశాల స్థితిగతులు, చట్టాల అమలు తీరుపై జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ వివరించారు. సిరికొండ ప్రాంతంలో భూఆక్రమణలు ఒకింత ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ కూడా అటవీ భూములు అన్యక్రాంతం కాకుండా పక్కాగా సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు సమస్య నెలకొన్న ప్రాంతాల్లో అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరిస్తూ జాయింట్ సర్వే ద్వారా రికార్డులు పక్కాగా పరిశీలిస్తూ సరిహద్దులను నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల రెన్యూవల్



ప్రజాపక్షం / మందమర్రి: సింగరేణి మాజీ ఉద్యోగులు, పెన్షనర్ల సౌకర్యార్థం సోమవారం మందమర్రి సిఇఆర్ క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో తొలిరోజు 185 మందికి జీవన్ ప్రమాణ్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను రెన్యూవల్ చేశారు. జిఎం రాధాకృష్ణ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డిజిఎం అశోక్, సిఎంపిఎఫ్ కమిషనర్ గోవర్ధన్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ కమిషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ పెన్షనర్లు సులభంగా లైఫ్ సర్టిఫికెట్లను పునరుద్ధరించుకోవడానికే ఈ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. సిఎంపిఎఫ్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్, ఒటిపిలను ఎవరికీ చెప్పవద్దని, సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ క్యాంపు మంగళవారం కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. పెన్షనర్లు పిపిఒ కాపీ, ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో పాటు ఆధార్ అనుసంధానమైన మొబైల్ వెంట తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఒ సత్యనారాయణ, ఎటిబి సెల్, సిఎంపిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులు క్రీడల్లో రాణించాలి: డిజిఎం కిరణ్‌బాబు

ప్రజాపక్షం / రెబ్బెన: బొగ్గు ఉత్పత్తిలో ప్రతిభ చూపుతున్న సింగరేణి ఉద్యోగులు క్రీడా పోటీల్లోనూ సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా డిజిఎం (పర్సనల్) కిరణ్ బాబు అన్నారు. గోలేటిలోని భీమన్న మైదానంలో సోమవారం 93వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా సమీప ప్రాంతాల క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల ఉద్యోగ క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. త్వరలో మందమర్రిలో జరగనున్న కంపెనీ స్థాయి పోటీలకు మరింతగా సన్నద్ధమై పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకుడు మారం శ్రీనివాస్, పర్సనల్ హెచ్ఓడి జ్ఞానేశ్వర్, డబ్ల్యుపిఎస్ అండ్ జిఎ కార్యదర్శి డి ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ బాబు, జనరల్ కెప్టెన్ ఎస్కె అబ్బాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'నడికూడ'ప్రజావాణిలో ఒకటే వినతి పత్రం

ప్రజాపక్షం / నడికూడ : నడికూడ మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఎంపిఒ మార్గవి రెడ్డి,తహశీల్దార్ రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన కార్యక్రమానికి 15 మంది అధికారులకు గాను 12 హాజరు కాగా 3 గైర్హాజరయ్యారు.మూడు గంటల సమయంలో కేవలం ఒక్క వినతి పత్రం మాత్రమే అందిందని అదికూడా రెవెన్యూ శాఖ నుండి సర్టిఫికెట్ దృవీకరించి తొందరగా ఇవ్వాలని కోరుతున్నట్లు ప్రజావాణిలో అందజేసిన వినతి పత్రం అని తెలిపారు.కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని సర్పంచ్ వినతి

ప్రజాపక్షం/ఖానాపురం: మండల కేంద్రంలోని ఐదవ వార్డులో సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టవద్దని కోరుతూ వార్డు ప్రజలు గ్రామ సర్పంచ్ దాసరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులోని ఓ ఇంటి స్థలంలో సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు యజమాని సన్నాహాలు చేస్తుండడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య టవర్ నిర్మాణం చేపట్టడం వలన రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య కాకుండా జనావాసాలకు దూరంగా టవర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఎలెనినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మరో సమస్యను తెచ్చి పెట్టవద్దని పేర్కొన్నారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా నిర్మాణం చేపడితే పెద్దయెత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బొప్పిడి రంగారావు, హరీష్, యాకాంతం కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వడం లేదని బ్రెయిన్ స్ట్రోక్‌తో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తీర్మాలాయపల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. అప్పు తీసుకున్న వ్యక్తి సంవత్సరాలు గడుస్తున్నా తిరిగి ఇవ్వడం లేదని మనస్తాపంతో ముద్రబోయిన ముత్తయ్య(75) అనే వ్యక్తి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గజవెల్లి అనంత ప్రసాద్‌కు ముద్రబోయిన ముత్తయ్య 2లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ముత్తయ్య అడుగుతున్న గజవెల్లి అనంత ప్రసాద్ కాలయాపన చేస్తూ వచ్చాడు. దీనితో మనస్థాపానికి గురైన ముత్తయ్య బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌లోని గాంధీ హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ముత్తయ్య ఆదివారం మరణించాడు. దీనితో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు మృత దేహాన్ని అప్పు తీసుకున్న మాజీ సర్పంచ్ అనంత ప్రసాద్ ఇంటి ముందు వేసి ఆందోళన చేపట్టారు. తన తండ్రి మరణానికి కారణం మాజీ సర్పంచ్ కారణం అని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలు పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు

ప్రజాపక్షం/జఫర్‌గడ్: జఫర్‌గడ్ మండల కేంద్రంలో చిలుకూరు కృష్ణమూర్తిగ అనారోగ్యంతో మరణించినందున వారి పార్థివ దేహాన్ని స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. అనంతరం వారికి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 ఆర్థిక సాయం చేయడం జరిగింది. అనంతరం వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా కల్పించడం జరిగింది. వారితో పాటు మాజీ సర్పంచ్ మొగిలిపాక నర్సింగం, మాజీ ఎంపీటీసీ జ్యోతి రజిత యాకయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు సారంగపాణి, మంచాల అనిల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇల్లందుల బాబు, నాయకులు పట్టపురి దాసు, మామిడి సుధాకర్, సాకి సాంబయ్య, సాకి సాంబయ్య (ఆటో) ఎండి.ఉమేర్, చేదులు సాంబయ్య, సాకి లింగస్వామి, సాకి వెంకట స్వామి, సాకి నర్సింగం, అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిదులు, ముఖ్య నాయకులు మరియు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.